# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు జరగనున్న ఎయిమ్స్ మంగళగిరి తొలి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.
- ❖ రాజధాని అమరావతిని మూడు సంవత్సరాల్లో పూర్తిచేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి నారాయణ తెలిపారు.
- ❖ రైతులకు నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందించాలని మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ పదవ తరగతి పరీక్షలు వచ్చే సంవత్సరం మార్చి 17 నుండి 31వ తేదీ వరకు జరగనున్నాయి.

========================

పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఈరోజు సందర్శించారు. రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి, పోలవరం ప్రాజెక్టు పనుల షెడ్యూల్‌ను ప్రకటించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు వచ్చే నెల 2వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని చంద్రబాబు నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

కాగా పోలవరం ప్రాజెక్టు పూర్తి అయినట్లయితే 7 లక్షల 20 వేల ఎకరాలకు సాగు నీటితో పాటూ 28 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

=======================

ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మంగళగిరి తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. రేపు జరగనున్న ఈ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జెపి నడ్డా, రాష్ట్ర మంత్రులు సత్యా కుమార్ యాదవ్, నారా లోకేశ్ లు గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఈ కార్యక్రమం రేపు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ స్నాతకోత్సవంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేయనున్నారు. ఆదే విధంగా 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలను అందించనున్నారు.

=======================

రైతులకు నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ వేర్ హౌసింగ్, మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో అమరావతిలో మంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీ సీడ్స్ ద్వారా రైతులకు చిరుధాన్యాలు, తృణధాన్యాల సాగు, వినియోగం పెంచే విధంగా విత్తన దశ నుంచే రాయితీ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 35 శాతం రాయితీపై గోదాములు అద్దెకు ఇచ్చినట్లయితే గిట్టుబాటు ధర వచ్చిన తర్వాత రైతులకు విక్రయించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. రాయితీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందించి భూసారం పెంపు, నాణ్యమైన దిగుబడి వృద్ధికి కృషి చేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.

=======================

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అవ్వాలంటే అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. ఈరోజు కలెక్టరు కార్యాలయంలో ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పంచాయతీ అవార్డులను అందుకున్న న్యాయంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు, తగరంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావు లను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలకు అవార్డులు రావడం సంతోషకర విషయమని, ప్రజాప్రజా ప్రతినిధులు ఇంకా బాగా పని చేసి జిల్లాకు మరిన్ని అవార్డులు సాధించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అవార్డులు పొందిన గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీసుకొని ప్రతి పంచాయతీని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దాలని సిబ్బంది, సర్పంచ్ లను కోరారు

విరామం

=======================

రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షలు వచ్చే సంవత్సరం మార్చి 17 నుండి 31వ తేదీ వరకు జరుగుతాయని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతి నాయుడు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో గల అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ షెడ్యూల్ ను విద్యార్థులకు తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

=======================

రాజధాని అమరావతిని 3 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. నీరుకొండలో ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాజధాని అమరావతి రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామన్నారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో పట్టాలిచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థలాలిస్తామని చెప్పారు. మరో 9 నెలల్లో అమరావతిలో అధికారులకు నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇప్పటికే 20 వేల

కోట్ల రూపాయల పనులకు సంబంధించిన టెండర్లకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని, మరికొద్ది రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ప్రాథమిక దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే తగు చికిత్స అందించడం ద్వారా నివారించవచ్చని తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ డాక్టర్ పి.వి.దివాకర్ తెలిపారు. శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు బి.ఎన్. కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కారణి గ్రామంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.వి.దివాకర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పింక్ బస్సుల్లో ఉచిత స్క్రీనింగ్ చేయించుకోవాలని కోరారు. ఈ బస్సులో నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేపడుతున్నామని వెల్లడించారు.

========================

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు తమ సొంత సమస్యగా భావించి నాణ్యమైన పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలతతో కలిసి ప్రజల నుంచి 133 వినతులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతీ సమస్యను తమ సొంత సమస్యగా భావించినపుడే శాశ్వత పరిష్కారం చూపగలుగుతారని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారం వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావివ్వరాదని స్పష్టం చేశారు. పరిష్కారం అయిన సమస్యలతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పునఃప్రారంభం కారాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

========================

శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో ఈరోజు స్వర్ణరథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బంగారు రథంపై ఆలయ మాడవీధులలో స్వామి అమ్మవార్లు విహరించారు. స్వర్ణ రథోత్సవం ఆలయ రాజగోపురం నుండి హరిహర రాయ గోపురం, శివాజీ గోపురం మీదుగా సాగింది. ఆలయ మాడవీధులలో స్వర్ణ రథోత్సవం జరుగుతున్న సమయంలో నామసంకీర్తన, గిరిజన చెంచు నృత్యాన్ని ప్రదర్శించారు.

========================
========================